Title Code: TELTEL 02105

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

Malkajgiri | Volume: 2 | Issue: 222 | Thursday, November 21, 2024 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 222 | గురువారం, నవంబర్ 21, 2024 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చ‌ఛార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331

సైబరాబాద్‌లో...

## మరో స్కాం

### రూ.300 కోట్ల టోపితో బోర్డు తిప్పేసిన సంస్థ

**హైదరాబాద్ :** సైబరాబాద్ పరిధిలో భారీ స్కాం వెలుగుచూసింది. రూ.300 కోట్లు కొల్లగొట్టి బోర్డు తిప్పేసింది ఓ సంస్థ. కూకట్‌పల్లి కేంద్రంగా 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ పేరుతో బడా మోసానికి పాల్పడింది. ఈ మోసంలో 3600 మంది బాధితులు చిక్కుకుపోయారు. తమ కంపెనీలో 8 లక్షల 8 వేల రూపాయలు కనీస పెట్టుబడిగా పెట్టి రెండు గుంటల స్థలాన్ని కొనుగోలు చేస్తే, 25 నెలల పాటు ప్రతి నెలా 4 శాతం చొప్పున అంటే నెలకు రూ.32 వేలు చెల్లిస్తామని జోరుగా ప్రచారం చేశారు. అంతేకాకుండా.. ఈ స్కీమ్‌లో మరెవరినైనా చేర్పించినా వారికి 25 నెలల పాటు ప్రతి నెలా రూ.7200 చొప్పున చెల్లిస్తామని ఆశ చూపింది 12 వెల్త్ సంస్థ. ఇదేగాక.. డబుల్ గోల్డ్ స్కీమ్‌లో కనీసం రూ.4 లక్షలు పెట్టుబడి పెడితే 12 నెలల తరువాత రూ.8 లక్షల విలువ చేసే స్విట్జర్లాండ్ గోల్డ్ బిస్కెట్ ఇస్తామని ట్రాప్ చేశారు. అంతేకాకుండా.. గోల్డ్ చిట్ స్కీమ్ పేరుతో మరో వల వేశారు. 5 లక్షల రూపాయలను 20 నెలల పాటు పెట్టుబడిగా పెడితే 19 నెలల పాటు నెలకు 15 వేల చొప్పున ప్రతి నెలా చెల్లిస్తామని.. 20వ నెల మరో 15 వేలు అదనంగా చెల్లిస్తామని నమ్మించారు కేటుగాళ్లు. ఈ క్రమంలో 3600 మంది బాధితులు పెట్టుబడి పెట్టి మోసపోయారు. తాము మోసపోయామని తెలుసుకుని సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు బాధితులు.

పది నెలలు కాలే దిగిపోవాల్నా?...


## కేసీఆర్‌ను నిలదీసిన రేవంత్

**వేములవాడ, కరీంనగర్ :** తాము అధికారంలోకి వచ్చి పదినెలల్లోనే పదవి దిగిపోవాల్నా.. వారి పదేండ్ల పాలనలో చేపట్టని అభివృద్ధని పది నెలల్లోనే చేసి చూపించాం అని సీఎం రేవంత్ అన్నారు. బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న తర్వాత జరిగిన సభలో ఉద్వేగంగా ప్రసంగించారు. రైతులకు రుణమాఫీ చేశామని కేసీఆర్ సభకు వస్తే లెక్కలు అప్పజెప్తామని అన్నారు. నిజాలను ఎదుర్కొనే ధైర్యం కేసీఆర్‌కు లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోయినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని సీఎం రేవంత్ అన్నారు. వేములవాడ విజయోత్సవ సభలో ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ హయాంలోనే సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించామన్నారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పనిచేసి ఉంటే సాగునీటి ప్రాజెక్టులు ఎందుకు పెండింగ్‌లో ఉంటాయని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు ప్రజల కోసం పనిచేయలేదన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ కుమార్ రెండు సార్లు ఎన్నికయ్యారని, అయినా కరీంనగర్‌లో ఏం అభివృద్ధి సాధించారని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధికి ఒక్క కాంగ్రెస్ మాత్రమే కట్టుబడి ఉందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు అభివృద్ధిని అడ్డుకునేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ గడీలను కూల్యేందుకు పాదయాత్ర చేశామని సీఎం అన్నారు. పదేళ్లలో కేసీఆర్ చేయలేని పనులను తాము చేసి చూపించామన్నారు. రాష్ట్రానికి రూ.ఏడు లక్షల కోట్లు అప్పులు మాత్రమే మిగిలచారని అన్నారు. తాము రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే పదేళ్ల మీ ప్రభుత్వంలో చేసిన రుణమాఫీ 10నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన రుణమాఫీపై లెక్కలు చెబుతామన్నారు. నిరుద్యోగ సమస్యపై తెలంగాణ ఉద్యమం నడిచిందని పదేళ్ల మీ పరిపాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ప్రజాపాలన ఏర్పడి పది నెలల కాలంలోనే 50వేల ఉద్యోగాలు ఇచ్చామని, దమ్ముంటే ఎల్బీ స్టేడియంకు రావాలని 50వేల తలకాయలు చూపెడతానని లేకపోతే క్షమాపణ చెబుతానన్నారు.



## ఆడపిల్లల జోలికి వస్తే...

# ఖబడ్దార్



### కఠిన చర్యలు తప్పవు: చంద్రబాబు

**వెలగపూడి:** ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్.. ఊరుకునేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్ వ్యతిరేకంగా పెద్దఎత్తున ర్యాలీ చేపడతాం. పిల్లలకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా భూకబ్జాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నా" అని సీఎం చంద్రబాబు అసెంబ్లీలో అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ధ్యేయంతో ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని, గత ప్రభుత్వ పాలనలో %ొ%ఎంత తవ్వితే అన్ని అక్రమాలు బయటకు వస్తున్నాయి. అప్పులు, తప్పులు, శాపాలు, నేరాలు ఒకదాని వెంట మరొకటి వస్తున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర బడ్జెట్ పై మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో రాష్ట్రం ఒక వెంటిలేటర్ పై ఉంది. ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలరా? అని ప్రశ్నించారు, కానీ నేను పారిపోను. పోరిపోలేను. ఆర్థిక వ్యవస్థల్ని చిన్నాభిన్నం చేశారు. విధ్వంసం చేశారు. అందుకే ప్రజలు విజ్ఞతతో నిర్ణయం తీసుకున్నారు. ఇక ప్రజల కోసమే పని చేస్తాం, సంక్షేమం, అభివృద్ధి కోసం ఒక్కొక్క ఇటుక పేరుస్తున్నాం. ఒక్క రోజులో ఏ పని జరగదు. 162 రోజులు గడిచాయి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం, అని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలూ గాడి తప్పాయి. అధికార యంత్రాంగం గాడి తప్పింది. వీటన్నిటినీ గాడిలో పెడుతున్నాం, అన్ని లెక్కలు తీస్తున్నాం, ఆధారాలు సేకరించాం, రూ.10లక్షల కోట్ల అప్పులు ఉనాయి. అయినా భయపడం అని సీఎం అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ప్రజల జీవన ప్రణామాలు మెరుగు పరుస్తాం. టీడీపీతోనే సంక్షేమం ఆరంభమైంది.

మహారాష్ట్ర ఎగ్జిట్ పోల్స్:

## మేజారిటీ సర్వేల మొగ్గు బీజేపీ కూటమి వైపే



**ముంబై:** మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం సాయంత్రం 6 గంటలకు ముగియడంతో పలు మీడియా, సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేస్తున్నాయి..

ఇప్పటి వరకు విడుదలైన సర్వేలలో ఒక్క దైనిక్ భాస్కర్ మినహా అన్ని బీజేపీ కూటమి కే మళ్ళీ అధికారం అని తేల్చి చెప్పాయి. జాతీయ మీడియా సంస్థ దైనిక్ భాస్కర్ సంచలన అంచనాలను విడుదల చేసింది. మిగతా అన్ని ఎగ్జిట్ పోల్స్ కు భిన్నంగా దైనిక్ భాస్కర్ రిపోర్టర్ల ఎగ్జిట్ పోల్ ఈసారి మహారాష్ట్రలో అధికారం విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిదే అని తేల్చిచెప్పేసింది.. మహారాష్ట్రలో మహాయుతి, మహా వికాస్ అఘాడీ కూటముల మధ్య హెూరాహెూరీ పోరు జరిగినా ఇందులో కాంగ్రెస్ నేతృత్వంలోని ఎంవీఏ గెలబోతున్నట్లు తేల్చింది. ఈసారి కాంగ్రెస్, ఎన్సీపీ శరద్ పవార్ వర్గం, శివసేన ఉద్ధవ్ థాక్రే వర్గంతో కూడిన మహా వికాస్ అఘాడీ కూటమికి 130 నుంచి 150 సీట్లు లభించే అవకాశం ఉందని దైనిక్ భాస్కర్ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. అలాగే బీజేపీ, శివసేన షిండే వర్గం, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంతో కూడిన అధికార మహాయుతి కూటమికి 125 నుంచి 140 సీట్లు వస్తాయని దైనిక్ భాస్కర్ అంచనా వేసింది. ఇతరులకు మరో 20 నుంచి 25 సీట్లు వస్తాయని తెలిపింది. పీ-మార్క్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ తాజాగా విడుదలయ్యాయి. మహారాష్ట్రలో ఎన్డీఏ అధికారం దక్కించుకునే అవకాశాలున్నాయని ఈ సర్వే తేల్చింది. అయితే, ఇండియా కూటమి గట్టిపోటీనిస్తుందని పేర్కొంది. అధికార మహాయుతి కూటమికి 175 నుంచి 196 సీట్లు వస్తాయని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ తెలిపింది. కాంగ్రెస్, ఎన్సీపీ, ఎస్పీ, శివసేన యూబీటీతో కూడిన మహా వికాస్ అఘాడీకి కేవలం 85-112 సీట్లు వస్తాయని పేర్కొంది. బీజేపీకి 113 సీట్లు, శివసేన షిండే వర్గానికి 52 సీట్లు, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి 17 సీట్లు వస్తాయని ఈ పోల్ అంచనా వేసింది. అలాగే మహా వికాస్ అఘాడీ కూటమిలోని కాంగ్రెస్ కు 35 సీట్లు, శరద్ పవార్ ఎన్సీపీకి 35 సీట్లు, ఉద్ధవ్ సేనకు 27 సీట్లు వస్తాయని అంచనా వేసింది.

జార్ఖండ్ ఎగ్జిట్ పోల్స్...

## జర్ఖండ్‌లో బిజెపి కూటమిదే అధికారం

జర్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు 2024 ఫలితాలపై సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడించాయి. అయితే మొత్తం 81 శాసనసభ స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా 41 సీట్లు గెలవాలి. మ్యాజిక్ ఫిగర్ 41 వచ్చిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.. 81 సీట్లున్న జార?ండ్ అసెంబ్లీకి రెండు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమి, ఎన్డీయే మధ్య హెూరాహెూరీ పోరు సాగినా అంతిమంగా ఎన్డీయేకే గెలుపు అవకాశాలున్నట్లు మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ తేల్చేసింది. జర్ఖండ్ అసెంబ్లీలోని 81 సీట్లలో అధికారం కోసం ఏ పార్టీకైన 41 సీట్లు రావాలి. అయితే ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష ఎన్డీయే కూటమికి 42 నుంచి 47 సీట్లు లభించబోతున్నట్లు ఏబీపీ ఎగ్జిట్ పోల్ తేల్చింది. అటు అధికార ఇండియా కూటమికి 25 నుంచి 30 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఇతరులకు మరో 1 నుంచి 4 సీట్లు వస్తాయని అంచనా వేసింది. దీంతో ప్రభుత్వ ఏర్పాటు కీలకంగా మారబోతోంది. గిరిజన రాష్ట్రమైన జార?ండ్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు అధికార మార్పుకు ఓటేశారని తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ఏబీపీ మ్యాట్రిజ్ తో పాటు పలు ఎగ్జిట్ పోల్ సంస్థలు కూడా ఇక్కడ విపక్ష బీజేపీ అధికారం చేపట్టబోతోందని అంచనా వేశాయి. దీంతో హేమంత్ సోరెన్ సర్కార్ అవినీతి మరకలు ఇండియా కూటమిని ముంచేసినట్లు తెలుస్తోంది.

## దేశానికే ఆదర్శం తెలంగాణ పోలీసులు: డిజిపి జితేందర్

**సిరిసిల్ల:** ఆంధ్రప్రభ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శమని రాష్ట్ర డిజిపి జితేందర్ తెలియజేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎస్పీ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ప్రారంభించగా డిజిపి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. .అనంతరం మాట్లాడుతూ నూతన కార్యాలయ సేవలు ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చాయన్నారు. శాంతి భద్రతల సంరక్షణలో దేశానికే ఆదర్శవంతంగా తెలంగాణ పోలీసింగ్ నిలుస్తుందని, సాంకేతికత దన్నుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందంజలో ఉందన్నారు. పోలీసు వ్యవస్థలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన భద్రత వ్యవస్థను రాష్ట్రంలో నెలకొల్పడం జరుగుతుందని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడే అంశంలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్థలు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ప్రజలకు మేలు చేసే పాలసీలను, వ్యవస్థల ఏర్పాటులో తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, జిల్లా పోలీస్ కార్యాలయ భవనం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఎస్పీ ఛాంబర్ లో అఖిల్ మహాజన్ కు డిజిపితోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## కేటీఆర్‌తో టీటీడీ చైర్మన్ భేటీ

**హైదరాబాద్:** తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బీఆర్. నాయుడు.. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్)ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందినగర్‌లోని నివాసం ఉన్నకేటీఆర్‌ను కలిసి శ్రీవారి ప్రసాదాలు, వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుకు శాలువా కప్పి సన్మానం చేసి వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను కేటీఆర్ అందజేశారు.



# తెలంగాణ షాన్

## సంపాదకీయం

# మసకబారుతున్న పసిబాల్యం

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపు కుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచు కోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచు కోవాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించ బడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది..1989, నవంబరు 20న బాలల హక్కుల పై సంప్రదాయ ఆచరణను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20 న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరి కొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్తోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధా కరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమిత మవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజ మాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగ జేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాద కరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించా లని రాజ్యాంగం ఆదేశం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలా మంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠ శాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొం దించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలను అంద జేయాలి: టీఎస్‌జెయు




**కాప్రా నవంబర్ 21 తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు:** జర్నలిస్ట్ సంక్షేమ పథకాలకు, అక్రిడేషన్ కార్డులకు లింకు పెట్టవద్దు.. ప్రభుత్వ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలి. తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ కుమార్ కు టీఎస్ ఆధ్వర్యంలో వినతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జె యు) ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ కుమార్ కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. అన్ని జర్నలిస్ట్ యూనియన్లకు అక్రిడేషన్ కమిటీలో భాగస్వామ్యం కల్పించాలని వారు కోరారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్ యుజె(ఐ) జాతీయ ఉపాధ్యక్షులు నారగొని పురుషోత్తం, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు, రాష్ట్ర నాయకులు క్రాంతికుమార్ లు కమిషనర్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి భద్రత, హక్కులను కాపాడడం ప్రభుత్వ బాధ్యతని వారు అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు వంటి అనేక సమస్యలను నివారించాలని వారు కోరారు. జర్నలిస్టుల భద్రతను సమర్థవంతంగా పరిరక్షించేందుకు జర్నలిస్టుల రక్షణ చట్టం తప్పనిసరిగా రూపొందించి అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమ పథకాలకు అక్రిడిటేషన్ లింకును తీసివేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్రిడిటేషన్ కార్డులు పొందని అనేక మంది జర్నలిస్టులు తమ వృత్తి సేవలను కొనసాగించడంలో తీవ్రమైన ఆర్థిక వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టుకు అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జర్నలిస్టులపై దాడుల నివారణ కోసం కమిటీలను నియమించాలని, బాధితులకు న్యాయం అందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో కమిటీలను పునరుద్ధరించాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల, స్థలాలు కేటాయించడంలో ప్రస్తుత యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించే సంఘాలకు మాత్రమే కాకుండా ప్రభుత్వం స్వయంగా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా చిన్న పత్రికలకు ఎంప్యానల్ మెంట్ జరగకపోవడం వల్ల చిన్న పత్రికల యజమానులు (వీరంతా జర్నలిస్టులే) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే చిన్న పత్రికలకు ఎంప్యానల్ మెంట్ చేయాలని వారు కోరారు. తెలంగాణ ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, చిన్న పత్రికలు, మీడియాకు ఆర్థిక సాయం అందించడానికి ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకం రూపొందించాలని వారు కోరారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్నది ఈ నేపథ్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికతో శ్వేత పత్రం విడుదల చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వార్తల సేకరణలో ప్రమాదకర పరిస్థితులు, ఆరోగ్య ప్రమాదాలు, వృత్తి సంబంధిత బెదిరింపులకు గురవుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కాపాడడానికి ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా జర్నలిస్టుల ఆసుపత్రి చికిత్సలు, ప్రమాద బీమా, ఆరోగ్య సంబంధిత సహాయాలు పొంద గలగాలని, జర్నలిస్టుల సురక్షిత భవిష్యత్తు కోసం ఈ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువెళ్లి అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## 'అవ్ని క్లినిక్స్ ఫర్ ఉమెన్" ను ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్









**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 20 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 – జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో నూతనంగా ఏర్పాటుచేసిన "అవ్ని క్లినిక్స్ ఫర్ ఉమెన్" ను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నూతన పరిజ్ఞానం అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటుచేసిన "అవ్ని క్లినిక్స్ ఫర్ ఉమెన్" ప్రేమే లక్ష్యంగా సేవయే మార్గంగా మంచి పేరును గడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నదీమ్ రాయ్, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, ఎల్లా గౌడ్, పోలే శ్రీకాంత్, నదీమ్ రాయ్, విజయ్ హరీష్, సిద్దిక్, ఫేరోజ్, డాక్టర్లు సాయి హర్షిణి, మనోజ్ఞ, శాలిని దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజా గోపుర శిఖర కలశ స్థాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు







**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 20 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారామచంద్రస్వామి శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి ఆలయ రాజా గోపుర శిఖర కలశస్థాపన పూజా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ రాజ గోపుర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంతరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు బురుగుబావి సత్యనారాయణ, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కోలుకుల జగన్, బౌరాంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కొంపల్లి వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ రామ్ రెడ్డి, కౌన్సిలర్ దప్పు కిరణ్, నాయకులు మురళి యాదవ్, మరియు నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనవసర గర్భసంచి తొలగింపులను ఆపలేమా?

అమెరికాలో 'గర్భసంచి తొలగింపు' ఆపరేషన్‌లు ప్రతి 10,000 మందిలో 55 మందికి జరిగితే, ఇంగ్లండ్‌లో కేవలం 20 మందికి మాత్రమే జరిగాయి. కానీ ఎంతో అభివృద్ధి చెందినవిగా, ఘనంగా చెప్పుకుంటున్న మన రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 10,000 మందిలో 920 మందికి ఈ ఆపరేషన్‌లు జరగడం దారుణం. అది కూడా స్త్రీలకు 29 ఏళ్ల వయస్సులోనే ఈ ఆపరేషన్లు చేస్తున్నారంటే, స్త్రీల ఆరోగ్యం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. సమాజంలో స్త్రీల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయబడుతోంది అనేది ఒక వాస్తవం. సమాజంలో స్త్రీ ఆరోగ్యానికి ఇచ్చే విలువ, ఆ స్త్రీకి సమాజం ఇచ్చే ప్రాధాన్యతపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల తక్కువగా చూడబడే స్త్రీ ఆరోగ్యం విలువ కూడా తక్కువగానే ఉంటుంది. ఒకప్పుడు బాగా పనిచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సైతం ఇప్పుడు నిర్వీర్యమై పోయాయి. ఈ రోజున స్త్రీల శరీరాలు ప్రయోగ శాలలుగా మార్చబడ్డాయి. ఆధునిక వైద్యం వాణిజ్యంగా మారిపోయిన తర్వాత ప్రజలకు వైద్యం అనేది అందని ద్రాక్ష పండే అయింది. ప్రభుత్వాసుపత్రులు నామమాత్రమైపోయిన ఈ సందర్భంలో ప్రభుత్వాలు స్త్రీ ఆరోగ్యానికి ఎంతటి ప్రాధాన్యతను ఇస్తున్నాయో పరిశీలిస్తే, ఆశ్చర్యకరమైన వాస్తవాలు కనబడతాయి. వైద్యులు స్త్రీల జీవితాలతో, ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న ఈ సందర్భంలో డా.సామవేదం వెంకట కామేశ్వరి, సూర్యప్రకాశ్ దంపతులు 2001లో మెదక్ జిల్లా సదాశివపేటలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నప్పుడు మునిపల్లె మండలంలోని దాదాపు 20 గ్రామాల్లో 171 మందికి గర్భసంచిలు అతి పిన్న వయస్సులోనే తొలగించారని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ ఘోరమైన అన్యాయాన్ని ఎలాగైనా ఆపాలనే పట్టుదలతో చిత్తశుద్ధితో సంస్థ ద్వారా మెడికల్ ఎథిక్స్ విభాగంలో దీన్ని ఒక కేసు కింద తీసుకుని (2009–12) మధ్య కాలంలో ఈ అంశాన్ని చర్చించింది. "గర్భసంచిని కాపాడుకుందాం సమాజాన్ని బలపరుద్దాం "అనే పుస్తకాన్ని మొదట 2017 సంవత్సరంలో ప్రచురించారు. తెలంగాణా ప్రభుత్వ సహకారంతో 2018 సంవత్సరం జనవరి నుండి ఆగస్టు వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆరోగ్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు, మహిళా సమాఖ్య సభ్యులకు, 81 గ్రామాల్లో 16000 మందికి పైగా స్త్రీలకు పెద్ద ఎత్తున గర్భసంచి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంతేగాక రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక పాఠశాలల్లో, కాలేజీలలో విద్యార్థినులకు గర్భసంచి ప్రాధాన్యత గూర్చి వివరించారు. ఇక జాతీయ స్థాయిలో దేశంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.ప్రాదివాలా ధర్మాసనం 2023 ఏప్రిల్ 5న గర్భసంచి తొలగింపు ఆపరేషన్లను కట్టడి చేస్తూ 3 నెలల కాల వ్యవధిలో రాష్ట్ర ప్రభు త్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖకు మార్గదర్శకాలు జారీ చేసింది. అయినా ఇంతవరకు క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు అమల్లోకి రాలేదు. వీరి కృషి ఫలితంగానే ప్రభుత్వ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ పథకాలలో, అప్పటివరకు విచ్చలవిడిగా అమలవుతున్న అనవసర గర్భసంచిల ఆపరేషన్లను గతంలో 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలగించింది. ఈరోజున వైద్యరంగం లో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నప్పటికి, ఆధునిక వైద్య వ్యవస్థ, పునరుత్పత్తి విషయంలోనూ, స్త్రీల ఆరోగ్య విషయం లోనూ నిర్లక్ష్యం చేయబడుతోంది. సాధారణంగా వారు ఎదుర్కొనే తెల్లబట్ట, దురద, దుర్వాసన, పొత్తి కడుపు నెప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం లాంటి కారణాలతో స్త్రీలు గర్భసంచిని తొలగించుకుంటున్నారు. దీనివల్ల స్త్రీల జీవితాలు మరింత దుర్భ రంగా మారుతున్నాయి దాన్ని ఎవరు సరిచేస్తారు? తొలగించిన అవయవాల పనులను అవి స్రవించే హార్మోన్లలను ఎలా భర్తీ చేస్తారు? అయితే, వీటన్నిటి వెనక సామాజిక, ఆర్థిక సాంస్కృతిక దృక్కోణాలు ఉన్నాయి. స్త్రీకి తన శరీరం మీద, తన ఆరోగ్యం పట్ల నిర్ణయాధికారం లేదు. అందువల్లనే స్త్రీల ఆరోగ్యంపై పురషుడి పెత్తనం, సమాజం అదుపు ఉంటాయి. స్త్రీ పిల్లల్ని కనాలా!వద్దా! కంటే ఎంతమందిని కనాలి? ఎవరిని కనాలి? (ఆడ,మగ) అనే విషయాలలో నిర్ణయం పురుషుడిదే. స్త్రీల ఆరోగ్యం గురించి పట్టించుకోని ఈ ప్రభుత్వాలు, ఈ వ్యవస్థలు స్త్రీలు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో శాసిస్తుంది. కాబట్టి వ్యవస్థీకృతం చేయబడ్డ ఈ సమాజంలోనే స్త్రీ మనుగడ సాగించాల్సి వస్తోంది. దానికి తోడు స్త్రీల అవగాహన లేమి సామాజిక, ఆర్థిక పరిస్థితులు కారణాలుగా ఉంటున్నాయి'. వెనకబడిన సామాజిక వర్గాల వారి పరిస్థితి కూడా ఇందుకు దోహదమవుతోంది. స్త్రీలు తమ ఆరోగ్యం గురించి, గర్భసంచిలను అనవసరంగా తొలగించటం లాంటి విషయాల గురించి, ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను నిలదీయాల్సిన అవసరం ఉంది. ఎన్నికల్లో స్త్రీలు పోటీ చేయ డం ద్వారా రాజకీయంగా కూడా సవా ల్ చేయవచ్చు. ఈ పనిని నేడు ఉనికిలో ఉన్న రాజకీయ పార్టీలు పట్టించుకునే స్థితిలో లేవు. డాక్టర్.కామేశ్వరి లాంటి ఔత్సాహికులైన వైద్యులు వ్యక్తిగత స్థాయిలో చిన్న సంస్థ ద్వారా చేసే ప్రయత్నానికి మహళలు, స్త్రీల సమస్యల కోసం పనిచేసే మహిళా సంఘాలు ముందుకు వచ్చి తమ తోడ్పాటును అందించటం చాలా అవసరం. ఈనాడు లాటిన్ అమెరికా, క్యూబా లాంటి దేశాలు ఇంటిపని, పిల్లల పెంపకం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందో ళన చేపడుతున్నాయి. అబార్షన్ హక్కు స్త్రీలకు ఉండాలని, పిల్లలు కనా లా!వద్దా! అనేది స్త్రీలే నిర్ణయించుకోవాలని పోరాడుతున్నా యి. అందువల్ల స్త్రీల సమస్యలపై జరిగే ఈ పోరా టాల నుంచి స్ఫూర్తి పొంది దీన్ని రాజకీయ సమస్యగా గుర్తించి స్త్రీల హక్కులకై పోరాడడం ద్వారా నే స్త్రీల ఆరోగ్య హక్కును సాధించుకోవాల్సి వుంది.

## స్వాతంత్ర్య యోధులకు స్ఫూర్తి

టిప్పు సుల్తాన్ (1751 –1799) భారతదేశ చరిత్రలో దేశభక్తుడు, శక్తివంతమైన పాలకుడు, మైసూర్ సామ్రాజ్యానికి పునాది పటిష్ఠం చేసిన మహానాయకుడిగా నిలిచారు. "మైసూర్ పులి" అని ప్రఖ్యాతి గాంచిన ఆయన, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కబంధ హస్తాల్లో భారత స్వతంత్రాన్ని కాపాడేందుకు చేసిన పోరాటానికి చిహ్నంగా నిలిచారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మొదటి పోరాట యోధుడిగా భావించబడే టిప్పు సుల్తాన్, తన పాలనలో సైనిక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో విశేషమైన ప్రగతిని సాధించారు. టిప్పు సుల్తాన్ 1751 నవంబర్ 20న దేవనహళ్లి (నేటి కర్ణాటకలోని బెంగళూరుకు సమీపం)లో జన్మించారు. ఆయన తండ్రి హైదరాలి, తల్లి ఫాతిమా ఫకరున్నిస్సా. హైదరాలి మైసూర్ సామ్రాజ్యానికి సైన్యాధికారి నుంచి సామ్రాజ్య స్థాపకుడిగా ఎదిగారు. తన తండ్రి నుండి టిప్పు సుల్తాన్ మంచి సైనిక వ్యూహాలు, పరిపాలన నైపుణ్యాలు, మరియు ధైర్య సాహసాలను నేర్చుకున్నారు. యువస్థాయి లోనే టిప్పు సైనిక చాతుర్యంతో ప్రసిద్ధి చెందారు. 15 ఏళ్ల వయసులోనే ఆయన తన తండ్రితో కలిసి ఆంగ్లేయుల మీద యుద్ధాల్లో పాల్గొన్నారు. వారి కుటుంబం మైసూరును స్వతంత్రమైన, బలమైన సామ్రాజ్యంగా తీర్చిదిద్దేందుకు తన శక్తి అంతా ఉపయోగించింది. టిప్పు సుల్తాన్ 1782లో తన తండ్రి మరణం తరువాత మైసూరు సామ్రాజ్యానికి పాలకుడిగా నియమితుడయ్యారు. ఆయన పాలనను చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిపింది. టిప్పు సుల్తాన్ తన పాలనలో ఆర్థిక ప్రగతికి పెద్దపీట వేశారు. వ్యవసాయానికి సంబంధించి భూమి పన్ను వ్యవస్థను పునర్నిర్మించి రైతుల సంక్షేమాన్ని మెరుగు పరిచారు. వాణిజ్యానికి పునాది వేసి, విదేశీ దేశాలతో వాణిజ్య సంబంధాలను బలపరిచారు. టిప్పు సుల్తాన్ రాకెట్ టెక్నాలజీ అభివృద్ధికి కీలకమైన నాయకుడిగా నిలిచారు. "మైసూర్ రాకెట్లు" అనేవి ప్రపంచం లోనే మొదటి క్షిపణి మార్గదర్శకంగా గుర్తించ బడుతున్నాయి. ఈ రాకెట్లు బ్రిటిష్ దళాల మీద ప్రభావవంతంగా ఉపయోగించ బడ్డాయి.

తెలంగాణ షాన్
TELANGANA SHAAN
గురువారం, నవంబర్ 21, 2024
Thursday, November 21, 2024

# ఐటీ పార్క్ నిర్మాణ పనులకు భూమి పూజ

- సాకారం కానున్న యువత ఆశలు
- కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్ నిర్మాణం భూమి పూజతో ప్రారంభం
- కై టి యా అధ్యక్షుడు, ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు







**మేడ్చల్ తెలంగాణ షాన్, నవంబర్ 20:** మేడ్చల్ మెట్రో రైలును కూడా ఫేజ్ 2 లో సాధిస్తాం - ఓరుగంటి వెంకటేశ్వర్లుమేడ్చల్ మెట్రోరైల్ సాధన సమితి.కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్ అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిని దాటింది , భూమి పూజా కార్యక్రమం తర్వాత అధికారికంగా గ్రౌండ్‌వర్క్ ప్రారంభమైంది. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో 2017 నుంచి ఈ ప్రాజెక్టుకు నిరంతర సహకారం కొనసాగుతున్న లాస్య ఇన్ఫోటెక్ మేనేజింగ్ డైరెక్టర్, కొంపల్లి ఐటీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (కిటీఈఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేక సంవత్సరాల నిరంతర నిరీక్షణ తర్వాత, తెలంగాణ ప్రభుత్వం కండ్లకోయలో వసువిశాలమైన 12 ఎకరాల స్థలాన్ని కేటాయించింది, ఇది 2022లో మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో జరిగిన శంకుస్థాపన వేడుకతో ముగిసింది. అయితే ఈ ప్రయాణంలో స్పందన లేకపోవడంతో బాటు అడ్డంకులు ఎదురయ్యాయి. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ( టి ఎస్ ఐ ఐ సి ) జారీ చేసిన నిర్మాణ టెండర్ల కోసం భావి బిల్డర్లకు యాదవ్ మరియు అతని బృందం ఎంతగానో సహకరించారు. డిపార్ట్‌మెంట్ మరియు వివిధ ఐటీ పార్క్ డెవలపర్‌లతో నిరంతర సంభాషణలలో నిమగ్నమై ఉన్నారు. అంతిమంగా, బెంగళూరులో ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎస్ఎంఎస్ ఇన్‌ఫ్రా, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ ) మోడల్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడానికి ముందుకొచ్చింది.

కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్‌లో 30,000 ఉద్యోగాల కల్పన అంచనాతో, ఐటీ నివాస మరియు వాణిజ్య కార్యకలాపాల కోసం ప్రత్యేక బ్లాకులను కలిగి ఉంది. "ఈ ఐటి ప్రాజెక్ట్ నార్త్ ఐటి కారిడార్ అభివృద్ధిలో ఒక మైలురాయి మాత్రమే కాదుబీ ఇది ఈ ప్రాంతానికి పరివర్తనకు ప్రాతినిధ్యం వహిస్తుంది" అని ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. ఈ అభివృద్ధితో పాటు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు 2వ దశ విస్తరణలో భాగంగా సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న మేడ్చల్ మెట్రో రైలును సాధించడంపై యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. మేడ్చల్ మెట్రో రైల్ సాధన సమితి, క్రియాశీల సభ్యునిగా, యాదవ్ విస్తృత ప్రచారానికి నాయకత్వం వహించారు, మేడ్చల్ మెట్రో రైలు కోసం 100,000 సంతకాలను సమీకరించాలనే ఆకాంక్షతో ఇప్పటి వరకు 20,000 సంతకాలను సేకరించారు. ఇంకా సంతకాల సేకరణ కొనసాగుతోంది. ఉత్తర హైదరాబాద్‌కు ఇది చాలా కీలకమైన సమయం అని యాదవ్ అన్నారు. "నగరం చుట్టుపక్కల 360-డిగ్రీల అభివృద్ధి చాలా అవసరం, మరియు మేడ్చల్ మరియు దాని పరిసర ప్రాంతాలలో కనెక్టివిటీ మరియు మొత్తం అభివృద్ధిని మెరుగుపరచడానికి ఐటీ పార్కులు మరియు మెట్రో రైలు సేవల స్థాపన అత్యవసరం. అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఈ అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని సంఘం సభ్యులు కోరుతున్నారు. మనం ముందుకు సాగుతున్నప్పుడు, కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్ మరియు ఊహించిన మెట్రో రైలు ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా, హైదరాబాద్ ఉత్తర కారిడార్ యొక్క ఆర్థిక ప్రకృతి దృశ్యాన్ని వేగవంతం చేయడంలో ఉత్ప్రేరకంగా కూడా పనిచేస్తాయి.

# "పంచముఖ హనుమాన్" దేవాలయ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్




**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 20 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ బతుకమ్మ బండలో పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ ల పర్యవేక్షణలో నిర్వహించిన పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పంచముఖ హనుమాన్ దీవెనలతో ప్రజలంతా పూర్తి ఆరోగ్యంతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం, సుంకరి చందు, ఇమ్రాన్ బేగ్, సాయిబాబా, హమీద్, విఠల్, మల్లేష్, ఆసిఫ్, రంజాన్, గోవర్ధన్ రెడ్డి, జునైధ్, ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పరమేష్ స్వామి, చెట్ల వెంకటేష్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం విచారణకు కేసీఆర్ రావాల్సిందేనా

**కరీంనగర్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ హీట్ క్రియేట్ చేస్తోంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌విచారణను స్పీడప్ చేసింది. ఆరోపణలు, అక్రమాలకు సంబంధించి ఇప్పటికే పలువురు అధికారులను విచారించింది కమిషన్. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలపై విచారణ జరిపేందుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ నెల 21న మరోసారి హైదరాబాద్‌కు రాబోతుందట. వచ్చే నెల 5 వరకు ఇక్కడే ఉండి పలువురిని విచారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పీసీ ఘోష్ కమిషన్..మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పుడు ఇరిగేషన్ మినిస్టర్‌గా పనిచేసిన హరీశ్ రావును కూడా విచారణకు పిలుస్తారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ కొనుగోళ్ల ఇష్యూలోనే కేసీఆర్‌ను ఇరికించే ప్రయత్నం జరిగింది. అప్పుడు విద్యుత్ కమిషన్ నోటీసులు ఇస్తే మాజీ సీఎం విచారణకు హాజరుకాలేదు. అంతేకాదు జస్టిస్‌నరసింహారెడ్డి కమిషన్‌కు విచారణార్హత లేదంటూ లేఖ రాశారు. న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్‌ఏర్పాటైందని..అలాంటి కమిషన్‌ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేసీఆర్. దాంతో ఏకంగా విచారణ కమిషన్ చైర్మన్ నే మార్చాల్సి వచ్చింది సర్కార్ కు. మరి ఇప్పుడు కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌ను విచారణ పిలిస్తే వెళ్తారా.? కేసీఆర్ విచారణకు హాజరుకాకపోతే కమిషన్ ఎలా ముందుకు వెళుందనేది ఉత్కంఠ రేపుతోంది. కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి..ఈ నెలాఖరున కేసీఆర్‌కు పిలుపు రాబోతుందన్న ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ విచారణకు వెళ్లకపోతే అరెస్ట్ చేస్తారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ అంత డేర్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామని హంగామా చేసిన కాంగ్రెస్‌ఇప్పటికే డైలమాలో పడింది. లగచర్ల ఘటనలో కేటీఆర్ అరెస్ట్‌పై బ్యాక్ స్టెప్ వేసినా కాంగ్రెస్ పెద్దలు..ఫార్ములా ఈ రేస్ కేసులో గవర్నర్ అనుమతి రాగానే ఆయన్ను జైలుకు పంపుతామంటున్నారు. ఇంతలోనే కాళేశ్వరం విషయంలో కేసీఆర్ కార్నర్ చేసే ప్రయత్నం జరుగుతోందిఅయితే విచారణకు కేసీఆర్‌హాజరవుతారా? లేక జస్టిస్‌ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు లేఖ రాసినట్లుగా..జస్టిస్‌పీసీ ఘోష్‌కు లేఖ రాసి దూరంగా ఉంటారా? అన్న చర్చ సాగుతోంది. జస్టిస్‌ఎల్.నర్సింహారెడ్డి స్థానంలో నియమితులైన జస్టిస్‌మదన్‌భీంరావు లోకూర్‌కమిషన్‌మాత్రం కేసీఆర్‌ను విచారణకు పిలవకుండానే నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇప్పుడు కూడా కేసీఆర్‌విచారణకు రాకపోతే..ఆయన ఇచ్చే లేఖనే అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పీసీ ఘోస్ కమిషన్ విచారణపై కూడా కేసీఆర్ స్టడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ తనకు నోటీసులు ఇస్తే ఎలా రియాక్ట్ కావాలో కూడా గులాబీ బాస్ ఓ క్లారిటీకి వచ్చినట్లు ఇన్‌సైడ్ టాక్. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి హామీలు, గ్యారెంటీల విషయంలో తీవ్ర ఒత్తిడిని ఫేస్ చేస్తోంది కాంగ్రెస్. అందుకే అపోజిషన్‌లో ఉన్నప్పుడు ఆరోపణలు చేసిన ఇష్యూస్‌లో కేసీఆర్ ఫ్యామిలీని ఇరికించి సైలెంట్ అయిపోయేలా చేయాలని ప్లాన్ చేస్తోందట రేవంత్ సర్కార్. ఈ టైమ్‌లో అటు కాళేశ్వరం విచారణ..ఇప్పటికే జరుగుతోన్న ఫార్ములా ఈ రేస్ కేసు దర్యాప్తు..ఏది ముందు..దేంట్లో అరెస్టులు ఉంటాయనేది టెన్షన్ క్రియేట్ చేస్తోంది. పీసీ ఘోష్ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరు అవుతారా లేదా అన్నది ఒక డిస్కషన్ అయితే. ఎలా స్పందిస్తారనేది ఇంకో పాయింట్. అదే సమయంలో ఫార్ములా ఈ రేస్ విషయంలో గవర్నర్ అనుమతిస్తే ప్రభుత్వం ఏం చేయబోతుందనేది కూడా హాట్ టాపిక్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఫస్ట్ ఎవరి అరెస్ట్ ఉంటుంది. ముందు అరెస్ట్ అయ్యేది తండ్రా.. తనయుడా అనేది ఉత్కంఠ రేపుతోంది.





# దూలపల్లి శ్రీ సీతారామ చంద్ర స్వామి, శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి దేవస్థాన రాజగోపురం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే





**కుత్బుల్లా సెప్టెంబర్ 20 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి లో శ్రీ సీతారామ చంద్ర స్వామి శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్టించిన రాజగోపురం ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవారాధనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ఆ సీతారామచంద్ర స్వామి యొక్క ఆశీస్సులు చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు శ్రీశైలం గౌడ్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బూర్గుబావి హనుమంతరావు, బూర్గుబావి సత్యనారాయణ, బి శివకుమార్, డప్పు నరేందర్ ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు ప్రజలు భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ కుల సంఘాల పెద్దలు కార్తీక మాస కార్తీకమాస మన భోజన మహోత్సవానికి ఆహ్వానాలు అందజేశారు





# రామ్ పోతినేని కొత్త సినిమా ఓపెనింగ్‌కు ముహూర్తం ఫిక్స్!




ఉస్తాద్ రామ్ పోతినేని హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ డైరెక్టర్ పి.మహేష్ బాబు దర్శకత్వంలో ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 22వ కావడంతో #RAPO22 అనే వర్కింగ్ టైటిల్ తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. కాగా, ఈ సినిమా ఓపెనింగ్ ఈవెంట్ డేట్‌ని ఖరారు చేశారు మేకర్స్. ఈ సినిమాను ఈ గురువారం (నవంబర్ 21న) పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించనున్నట్టు నిర్మాణ సంస్థ ఈ రోజు అనౌన్స్ చేసింది. సినిమా ప్రారంభోత్సవం రోజు ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

# 'బచ్చల మల్లి' రిలీజ్ డేట్ ఫిక్స్ !

అల్లరి నరేష్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అమృత అయ్యర్ కథనాయికగా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాని డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. 1990వ దశకంలో తుని ప్రాంతంలో జరిగిన కొన్ని యదార్ధ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాని తెరకెక్కుతుండగా.. ఈ సినిమాలో రావు రమేష్, హరితేజ, ప్రవీణ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.




# స్నేహితుడు ఆంటోని తట్టిల్‌ను వివాహం చేసుకోనున్న కీర్తి సురేష్

ప్రముఖ కథానాయిక కీర్తి సురేశ్ త్వరలో పెళ్లి చేసుకోబోతుందా? అంటే ఔననే అంటున్నాయి సినీ వర్గాలు. 'మహానటి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ కీర్తి సురేశ్ ఈ చిత్రం తరువాత తెలుగుతో పాటు పలు భాషల్లో హీరోయిన్‌గా బిజీ అయ్యారు. 'మహానటి' చిత్రంతో ఉత్తమ నటిగా జాతీయ అవార్డును పొందిన కీర్తి ప్రస్తుతం సినిమాలు చాలా సెలెక్టివ్‌గా చేస్తున్నారు. అయితే ఆమె త్వరలో తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోని తట్టిల్‌ను వివాహం చేసుకోబోతున్నారని సమాచారం. దుబాయ్‌లో స్థిరపడిన కొచ్చికి చెందిన ఆంటోని తట్టిల్‌తో కీర్తిసురేశ్‌కు పదిహేను సంవత్సరాల స్నేహబంధం ఉంది. త్వరలో వీరి స్నేహబంధం పెళ్లితో భార్యాభర్తల అనుబంధంగా మారనుంది. ఇందుకు ఇరు కుటుంబాల పెద్దలు కూడా అంగీకరించారట. డిసెంబర్ 11న వీరి వివాహం గోవాలో జరగనుందని సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. అంతేకాదు ఇప్పటికే కీర్తి సురేశ్ టాలీవుడ్, కోలీవుడ్‌లో కొంత మంది హీరోలకు శుభలేఖలు కూడా ఇచ్చారని చెబుతున్నారు. అత్యంత ఆత్మీయులు, స్నేహితుల మధ్య సింపుల్ గా వీరి వివాహ వేడుక జరుగుతుందని తెలుస్తోంది. ఈ వార్తకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలో రానుంది.





# గ్లామర్ పాత్రలకు సై అంటున్న బలగం హీరోయిన్..

బాల నటిగా గంగోత్రితో పాటు పలు సినిమాల్లో నటించి ముద్దుగా మాట్లాడుతూ, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో మెప్పించిన కావ్య కళ్యాణ్‌రామ్ ఇప్పుడు హీరోయిన్‌గా నటిస్తోంది. 2022లో టాలీవుడ్‌లో మసూద సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన కావ్యకి అనుకోని అదృష్టం అన్నట్లుగా బలగం సినిమాలో నటించడం, భారీ విజయం దక్కడం జరిగింది. బలగం భారీ విజయాన్ని సొంతం చేసుకున్నా తెలుగు అమ్మాయి, పైగా చైల్డ్ ఆర్టిస్టుగా చేసింది అనే కారణంతో కావ్య కి తెలుగులో ఎక్కువ ఆఫర్లు రావడం లేదు. అయినా కావ్య తన ప్రయత్నాలు తాను చేసుకుంటూ వచ్చిన ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రయత్నిస్తోంది. బలగం సినిమా హిట్ కావడంతో ఆ తర్వాత కొన్ని చిన్న చితకా ఆఫర్లు వచ్చాయి. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తుంది. ఇక కావ్య సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. రెగ్యులర్ కావ్య సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలతో వైరల్ అవుతూ ఉంటుంది. ఈసారి సెల్ఫీ క్లిక్స్ ను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. తన అందమైన రూపంను మిర్రర్ సెల్ఫీ ద్వారా నెటిజన్స్ కి షేర్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఎక్స్ ప్రెషన్స్ ఇవ్వగల కావ్య కళ్యాణ్ రామ్ మరోసారి ఈ ఫోటోలతో ఆకట్టుకుంటుంది. స్కిన్ షో పెద్దగా చేయకుండా కాస్త నడుము కనిపించేలా ఈ అమ్మడు చేస్తున్న కవ్వింపులకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. కావ్య అందంకు ఇంకాస్త ఎక్కువ ఆఫర్లు రావాల్సిందే అని, ఆమె చాలా తక్కువగా ఆఫర్లు పొందుతుందని అంటున్నారు.

# చరణ్ ఓకే... మహేష్ తో కష్టం



ఎన్నో ఏళ్ల కిందటే టాక్ షో చేశాడు రానా. ఇప్పుడు మరోసారి టాక్ షో చేస్తున్నాడు. అప్పుడు టీవీలో చేస్తే, ఇప్పుడు ఓటీటీ. అంతే తేడా. అయితే ఎప్పుడు ఎవరు టాక్ షో చేసినా అందులో కొంతమంది మిస్ అవుతుంటారు. అప్పుడు రానా చేసిన టాక్ షోలో కొంతమంది మిస్సయ్యారు. ఇప్పుడు రాబోతున్న "ది రానా దగ్గుబాటి షో" కూడా కొంతమంది మిస్సయ్యారు. మరీ ముఖ్యంగా రామ్ చరణ్, మహేష్. మరి.. వీళ్లు రాబోయే రోజుల్లో రానా షోలో కనిపించే ఛాన్స్ ఉందా? దీనిపై క్లియర్ గా ఉన్నదున్నట్టు చెప్పేశాడు రానా. తన షోలో మహేష్ బాబు కనిపించే అవకాశం లేదని చెప్పేశాడు. రాజమౌళి తో సినిమా చేస్తున్న మహేశ్, ఇప్పట్లో మరే ఇతర షోలో కనిపించడని స్పష్టం చేశాడు. అటు రామ్ చరణ్ పై మాత్రం పాజిటివ్ గా స్పందించాడు. ప్రతిసారి చరణ్ ను మిస్సవుతున్నానని, ఈసారి మాత్రం అతడ్ని తన షోకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని, కచ్చితంగా కాల్ చేసి మాట్లాడతానని హామీ ఇచ్చాడు. రాజమౌళి, నాగచైతన్య, సిద్ధు జొన్నలగడ్డ, ఆర్జీవీ, నాని, తేజ సజ్జా, దుల్కర్ సల్మాన్, ప్రియాంక మోహన్, మీనాక్షి చౌదరి, శ్రీలీల.. ఇలా చాలామందిని ఇప్పటికే కవర్ చేశాడు రానా. అయితే వీళ్లంతా సోలోగా రారు. రాజమౌళి, నాగచైతన్య లాంటోళ్లు సోలోగా ఉన్నారు. ఎక్కువ ఎపిసోడ్స్ లో మినిమం ఇద్దరు కనిపిస్తారు.

Edited, Printed, Published and Owned by Ramancharla Srikanth & Printed at RK PRINTERS, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. Title Code: TELTEL 02105. Editor: RAMANCHARLA SRIKANTH, Mob: 9963708331, Email: rcsrikanth143@gmail.com